ప్రజాశక్తి

సోమవారం 8 ఏప్రిల్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ముస్లిములు ఎటు వైపు ?

◆ విశాఖ దక్షిణంపైనే అందరి చూపు

◆ ఎన్నికల్లో ప్రభావం చూపనున్న సిఎఎ అంశం



సిఎఎకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపడుతున్న ముస్లిములు (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగర పరిధిలో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న నియోజవర్గం దక్షిణం. దీనికి కారణం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో హిందువులతో పాటు, ముస్లింలు, క్రిస్టియన్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆ మూడు మతాలకు చెందిన ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, మసీదులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. అంతేకాకుండా రోజ్ హిల్స్ కొండపై మూడు మతాలకు చెందిన ప్రముఖ దేవాలయాలు కొలువుదీరి ఉన్నాయి. అయినప్పటికీ ఇక్కడ మతసామరస్యానికి ఎటువంటి అవరోధమూ లేదు. ఆ ప్రస్తావన ఇక్కడ రాదు. అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఈ నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గం రాజకీయంగా కూడా ఎంతో చైతన్యం కలిగినది. విశాఖలోని మిగతావాటితో పోలిస్తే ఈ నియోజకవర్గంలో ముస్లిములు గణనీయంగా ఉన్నారు. పాలకులు మారుతున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత వీరు అభద్రతా భావానికి లోనవుతున్నారు. అందునా నరేంద్ర మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై వీరు ఆగ్రహంతో ఉన్నారు. ఆ చట్టం అమలు కోసం నిబంధనలు ప్రకటించడంపై ఇక్కడి వారు పెద్ద ఎత్తున ఉద్యమించారు. మునుపెన్నడూ లేనంతగా నగరంలో ముస్లిములు భారీగా కదిలి నిరసనలు తెలిపారు. కేంద్ర బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతునిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను దుమ్మెత్తిపోశారు. ఈ క్రమంలో ఈ ఎన్నికల్లో వారు ఎటువైపు ఉంటారన్న విషయం రాజకీయ పార్టీలకూ అంతుబట్టడం లేదు.

స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం వంటి ప్రముఖులు ఒకప్పటి విశాఖపట్నం నియోజవర్గం (ఇప్పటి దక్షిణం) నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ రాజకీయవేత్త విశాఖ-1 (ఇప్పటి దక్షిణం) నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రస్తుతం మిజోరాం గవర్నర్‌గా ఉన్న డాక్టర్ కె.హరిబాబు సైతం గతంలో ఇక్కడి నుంచే గెలిచారు. అలాగే ఒకప్పటి విశాఖపట్నం నియోజవర్గం నుంచి 1972లో ముస్లిం నేత డాక్టర్ ఎంఆర్ డీన్ కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1994లో విశాఖ 1 టిడిపి అభ్యర్థి ఎస్.ఎ.రెహమాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన ద్రోణంరాజు సత్యనారాయణ ఆకస్మికంగా మరణించడంతో 2008లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో ఆయన కుమారుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు కాంగ్రెస్ అభ్యర్థిగాను, ఎస్.ఎ.రెహమాన్ టిడిపి అభ్యర్థిగాను పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రెహమాన్ ఓటమి చెందారు. ఈ విధంగా చూస్తే ఈ నియోజకవర్గ నుంచి మూడు పర్యాయాలు మిగతా 2లో..



అనకాపల్లిలోని ఆసుపత్రి వద్ద క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

పరవాడ ఫార్మా సిటీలో ప్రమాదాలు

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కార్మికులు మృతి, ఐదుగురికి అస్వస్థత
- ప్రమాదాలపై విచారణ జరిపి యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : సిపిఎం, సిఐటియు

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని రాంకీ ఫార్మాసిటీలో ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విశాఖ, అనకాపల్లిల్లోని ఆసుపత్రుల్లో వారు చికిత్స పొందుతున్నారు. కొంతకాలంగా ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఫార్మాసిటీలో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

(వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ 5వ పేజీలో..)

ఓటు వేయాలంటే అవస్థలే!

▶ వార్త 8లో..

ఉష్ణ తాపంతో ఉక్కిరి బిక్కిరి..

▶ వార్త 3లో..

విశేష సేవలకు పురస్కారాలు

▶ వార్త 2లో..



దీక్షా శిబిరంలో జగ్గునాయుడు, తదితరులు

బిజెపిని, దాని మిత్రులను ఓడిస్తేనే ఉక్కుకు రక్షణ

కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు

వార్త మెయిన్‌లో..



మాట్లాడుతున్న పవన్

విమర్శలకే పరిమితం

- ఉక్కు పరిరక్షణపై స్పష్టత ఇవ్వని పవన్
- అనకాపల్లిలో వారాహి యాత్ర

వార్త మెయిన్‌లో..

ప్రతిపక్ష పార్టీలపై

కేంద్ర సంస్థలతో బిజెపి కక్షపూరిత దాడులు

- ఎన్నికల బాండ్లు అక్రమ సంపాదన విషయాన్ని దాచేందుకే కేజ్రీవాల్ అరెస్ట్
- సిపిఎం, సిపిఐ నేతలు కె.లోకనాథం, ఎం.పైడిరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల బాండ్లు పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి కోట్లాది రూపాయలను పోగేసుకున్న బిజెపి దానిని దాచిపెట్టి, తప్పుదోవ పట్టించేందుకే తప్పుడు కేసులలో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. కేజ్రీవాల్‌ను తక్షణం విడుదల చేయాలని కోరుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. వాటికి లోకనాథం, పైడిరాజు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ప్రతిపక్షాలకు చెందిన వారిపై ఇడి, సిబిఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ వంటి కేంద్ర సంస్థల ద్వారా దాడులు జరిపించి అక్రమంగా వారిపై తప్పుడు కేసులు బనాయించడం, అరెస్టులు చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షాలకు చెందిన వారి ఆస్తులను అకారణంగా జప్తు చేయడం దుర్మార్గమన్నారు. సుజనా చౌదరి, సిఎం రమేష్ వంటి అవినీతిపరులు ఇతర పార్టీల నుంచి బిజెపిలోకి వచ్చి చేరితే సచ్ఛీలురుగా పేర్కొంటూ అటువంటి వారికి సట్టసభల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు ఇస్తున్నారని విమర్శించారు. బిజెపి కుట్ర రాజకీయాలను దేశ ప్రజలంతా ఈసరికే గుర్తించారన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సూత్రధారి శరత్ చంద్ర రెడ్డి అని చెప్పారు. ఆయన బిజెపికి పెద్ద ఎత్తున నిధులు అందివ్వడంతో ఆ కేసులో ఆయనను అప్రూవర్‌గా మార్చి కేజ్రీవాల్ వంటి వారిని అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. కేజ్రీవాల్‌పై పెట్టిన తప్పుడు కేసులను రద్దుచేసి ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శీర రమేష్ కుమార్ మాట్లాడుతూ మిగతా 2లో..

17న అంబికాబాగ్‌లో సీతారామ కల్యాణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దత్తత దేవాలయం మహారాణిపేట అంబికాబాగ్ దగ్గర ఉన్న సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 17న శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఉప కమిషనర్, కార్య నిర్వహణ అధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. ఆదివారం సీతారామ స్వామి దేవాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి వసంత నవరాత్రులలో భాగంగా ఈ నెల 9న మంగళవారం సీతారామ కల్యాణానికి రాట ప్రతిష్ఠ, శ్రీరాముని పెండ్లి కుమారుని చేయుట, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరోజు దేవస్థాన ప్రాంగణంలో ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 16 వరకు ప్రతిరోజు సీతారామస్వామికి విశేష ఆరాధన, సహస్ర నామార్చన, సాయంత్రం విశేష ఆరాధన, విశేష హారతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న చైత్ర శుద్ధ నవమి బుధవారం శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని సీతా రామస్వామి దేవస్థానంలో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వృషభ మిథున లగ్నంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో దేవస్థానం అసిస్టెంట్ ఇఒలు వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, సీతారామ దేవస్థానం ప్రధాన అర్చకులు బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ముస్లిములు ఎటు వైపు ?

ముస్లిం నాయకులు పోటీ చేశారు.

ముస్లిం ఓటర్లు అధికం

ఇదిలా ఉండగా ఈ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్నారు. 1999 ఎన్నికల నాటికి వీరి సంఖ్య 10,600 కాగా, ఇప్పుడు వారి సంఖ్య సుమారు 15 వేలకుపైగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజన రెండు పర్యాయాలు జరిగినప్పటికీ ముస్లిం డామినేషన్ ఉన్న ప్రాంతం మాత్రం ఇదే నియోజకవర్గంలో ఇంతవరకు కొనసాగుతోంది. ఈ ప్రాంతానికి చెందిన ముస్లిం నేత మహమ్మద్ సాధిక్ అసెంబ్లీ టిక్కెట్టు ఆశించి రాజకీయాలు చేస్తూ వచ్చారు, మూడేళ్ల క్రితం జరిగిన జివిఎంసి ఎన్నికల్లో ఆయన 39వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కార్పొరేటర్‌గా విజయం సాధించారు. తొలి నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను గట్టిగా వ్యతిరేకిస్తూ రాజకీయాలు చేస్తున్న సాధిక్ ఈసారి కూడా అదే వైఖరిని అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో టికెట్ ఆశించి దాదాపు ఏడాది క్రితం జనసేన పార్టీలో చేరారు. ఈ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన పోటీ చేసే అవకాశం కలిగినప్పటికీ ఆయనకు కాకుండా పొరుగు నియోజవర్గానికి చెందిన చెందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆ పార్టీ టికెట్ దక్కింది. దీంతో సాధిక్ మౌనం దాల్చారు.

అయితే నియోజవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింలు ఈసారి ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారనేది చర్చనీయాంశంగా మారింది. బిజెపితో జతకట్టి జనసేన పార్టీ ఎన్నికల బరిలో ఉండడంతో ముస్లింలు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సిఎఎను ముందుకు తెచ్చింది. 2024 ఎన్నికల అనంతరం ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టంగా ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలతో పాటు దక్షిణ నియోజకవర్గంలో గరిష్ట సంఖ్యలో ఉన్న ముస్లింలు కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు సిఎఎకి వ్యతిరేకంగా ఎవరు పిలుపు ఇచ్చినప్పటికీ రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ నియోజకవర్గ ముస్లింలు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బిజెపి చర్యను గర్హిస్తున్నారు. ఇప్పటికీ వారు అదే వైఖరితో ఉన్నారు. ఇది జనసేన, టిడిపి, బిజెపి కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు పెద్ద నష్టం కలిగించే వీలుందని పరిశీలకులు భావిస్తున్నారు. అదే సందర్భంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి అభ్యర్థులకు ముస్లిం మద్దతు ఉంటుందా అంటే అవుననే సమాధానం రావడం లేదు. ఈ పరిస్థితిలో ఇండియా కూటమి అభ్యర్థిగా మరోసారి దక్షిణంలో ముస్లిం అభ్యర్థి ఎన్నికల బరిలోకి వస్తే మంచిది అనే అభిప్రాయం కొంతమంది ముస్లిములలో వ్యక్తమవుతోంది. అది సాకారం అవుతుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేం. ఇండియా కూటమి అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. సరైన అభ్యర్థులు ఇండియా కూటమి తరపున ఇటు దక్షిణ అసెంబ్లీకి, అలాగే విశాఖ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉంటే ముస్లిముల మద్దతు ఉంటుందనడంలో సందేహం లేదు.

కేంద్ర సంస్థలతో బిజెపి కక్షపూరిత దాడులు



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశాన్ని అంధకారంలోకి నెట్టివేస్తోందన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు వి.కృష్ణారావు, చలపతి, సిపిఐ నాయకులు ఎ.విమల, జెవిఎస్.అచ్యుత రావు, భారత్ బచావో నాయకులు వేమన, శ్రీనివాస్ ఉన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ పైల రమేష్ రాజు, ధనాల కోటి రమణ, రామ సంతోష్, నిమ్మకాయల భాస్కర్, బి.యజ్ఞనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

34వ వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 34వ వార్డులో జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి గ్లాస్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మనోరమ థియేటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం అంబేద్కర్ కాలనీ, జెండా చెట్టు, లక్ష్మీదేవి పేట, భూపేష్ నగర్, తారక రామ కాలనీ, నరహర వీధి, అచ్చియ్యమ్మ పేట వరకు సాగింది. కార్యక్రమంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పాల్గొన్నారు. 29వ వార్డులో కూడా జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు శ్రావణ్, ఉరుకూటి గణేష్, శేఖర్, మాజీ కార్పొరేటర్ బుద్ధల అనురాధ, మన్యాల శ్రీనివాస్, పరంజి ఈశ్వర్ పాల్గొన్నారు.

విశేష సేవలకు పురస్కారాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన దేశం భారత దేశమని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. వి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన 'వి పురస్కార్-2024' అవార్డుల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశం గొప్ప తనాన్ని నేటి తరానికి చాటి చెప్పాల్సిన సామాజిక బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, వి డెంటల్ డైరెక్టర్ రమేష్ కెఎంకె, ప్రముఖ బాల గాయకుడు దొంతంశెట్టి ధీరజ్, వి డెంటల్ మేనేజింగ్ డైరెక్టర్ జగ్ మాడుగుల, అనిత మాడుగుల, మైరా మీడియా ఇన్‌చార్జి ఉదయ్ కొల్లి, ఐ.వి.ఎస్.పద్మనాభరావు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం లలిత కళల ప్రోత్సాహం విభాగంలో అవార్డు గెలుచుకుంది.

ఘనంగా ఎన్‌టిఎస్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నావల్ ట్రాన్స్‌మిటింగ్ స్టేషన్ 55వ వార్షికోత్సవాన్ని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సందడిగా గడిపారు. ఇంటర్ డిపార్ట్‌మెంటల్ స్పోర్ట్స్ కాంపిటీషన్, టగ్ ఆఫ్ వార్, బెస్ట్ గార్డెన్ కాంపిటీషన్, క్లీన్-అప్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎన్ఎస్ సర్కార్ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ హ్యాపీ మోహన్ హాజరై నావల్ ట్రాన్స్‌మిటింగ్ స్టేషన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంకుడు గుంతలతో మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సకల మానవాళికి, జీవులకు నీరు ప్రాణాధారమని, నీటిని పొదుపు చేస్తూ ఇంకుడు గుంతలు నిర్మించి, ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

విశాఖ మార్కెట్‌లోకి అర్బన్ క్రూయిజర్ టైజర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ ఎ - ఎస్ యువీ విభాగంలోకి కంపెనీ రీ-ఎంట్రీని గుర్తుచేస్తూ పూర్తి సరికొత్త టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్ ఆధునిక స్టైలింగ్, అత్యాధునిక ఫీచర్లు, సాంకేతికతలను కలిగి ఉందని చెప్పారు.

ఉష్ణ తాపంతో ఉక్కిరి బిక్కిరి..

ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్న జనం

ప్రజాశక్తి -తగరపువలస : గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మండుటెండలకు తోడు వడ గాల్పులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సాయం సంధ్య వేళ దాటి చీకటి పడినా వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో నిత్యం జన సమర్ధంగా ఉండే తగరపువలస కూడలిలో రహదారులు ఆదివారం ఉదయం 11.30 గంటలకే నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రధాన రోడ్డు కర్ఫ్యూను తలపించాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి టోపీలు పెట్టుకొని, గొడుగులు వేసుకొని బయటకు వస్తున్నారు. బైక్‌లు, ఇతరత్రా వాహనాలపై ప్రయాణించే వారు సైతం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇళ్లలోని గోడలు, వస్తువులతో పాటు దుస్తులు నీడలో ఉన్నప్పటికీ వేడెక్కి పోతున్నాయి.

తాటి ముంజెలు, మజ్జిగ వంటివి తీసుకున్నప్పటికీ గొంతు తడారి పోయే పరిస్థితి ఉంది. మండుటెండల తీవ్రతకు చిన్న పిల్లలు, వృద్ధులతో పాటు రోగులు ఊపిరి సలపని పరిస్థితి ఉంటోంది. ఏప్రిల్ నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ముందుందు అగ్ని కార్తెల నాటికి ఇంకెంత ఇబ్బంది కరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తప్పని సరి

ఎండా కాలంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు సాధ్యమైనంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. మిగిలిన వారు అత్యవసరమనుకుంటే ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత బయటకు వెళ్లడం మంచిది. అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, కళ్లద్దాలు ధరించాలి. గొంతు ఎండి వడ దెబ్బకు గురి గాకుండా ఎప్పటికప్పుడు మంచి నీరు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు వంటివి తీసుకోవడం మంచిది. పకోడీ, సమోసా, వేపుళ్ల వంటి తిళ్లకు దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకూ ఆకు కూరలు తినాలి.



డాక్టర్ కె.రామారావు
తగరపువలస



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జి

కూటమి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 51వ వార్డులో సనపల కీర్తి అధ్యక్షతన ఎన్‌డిఎ కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి విశాఖ అధ్యక్షులు గండి బాబ్జి హాజరై మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలమరశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు, జనసేన వార్డు అధ్యక్షుడు గుడివాడ అప్పారావు, బిజెపి వార్డు అధ్యక్షులు తమ్మినేని లోహితరావు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డులో ఆరుగురు వాలంటీర్లు రాజీనామాచేశారు. వారు రాజీనామా పత్రాలను జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ మీద పెట్టుకున్న నమ్మకానికి కృతజ్ఞతగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ జెండా చేత పట్టి, వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

మహనీయుల స్ఫూర్తితో సామాజిక సేవ

ప్రజాశక్తి-గాజువాక: స్వామి వివేకానంద, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన కొయిలాడ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఉగాది సంబరాల పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని 65వ వార్డు పరిధి భానోజీ కాలనీలో నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే సేవా కార్యక్రమాలను వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివేకానందుని స్ఫూర్తి, మదర్ థెరిసా ఆశయ సాధనకు అనుగుణంగా ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలా గొప్పవని కొనియాడారు. అనంతరం పేద విద్యార్థులకు ఉచిత తరగతులను ప్రారంభించారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు, మానసిక వికలాంగ పిల్లలకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ ఎస్‌కెఎల్ రావు, పెన్మెత్స ఆదినారాయణరాజు, దాసరి బుజ్జి, రాజగిరి జగన్‌మోహన్, బుడుమూరు వాసు, డాక్టర్ సాయి భారతి, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయ జూ లవర్స్‌డేను పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 3 నుంచి 12 ఏళ్ల వయస్సు గల చిన్నారులు జంతువుల వేషాధారణలతో పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమానికి సదరన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సిఎండి స్వప్న, ఫ్యాషన్ డిజైనర్ పూజిత ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో వన్యప్రాణుల సంరక్షణ పట్ల బాధ్యతాయుత భావాన్ని తెలియజేస్తాయన్నారు. ఈ విధంగా చిన్నారులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు

కూటమి సభ్యుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : ఎండాడలోని జనసేన కార్యాలయంలో ఉమ్మడి పార్టీల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అందరికీ మంచి చేస్తాడనుకొని జగన్‌ను గెలిపిస్తే మొదటి రోజే ప్రభుత్వ వేదిక కరకట్ట కూల్చి విధ్వంసకర విశ్వరూపం చూపించారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా పోలీస్ యంత్రాంగాన్ని ఉసి గొల్పి కేసులతో ప్రతిపక్షాలపై దాడులకు దిగారని ఆరోపించారు. ఇవన్నీ ఆలోచించే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయ బెట్టుకు పోకుండా ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవటానికి కూటమి ప్రతిపాదించడం అభినందనీయమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జనసేన నాయకులు, కార్యకర్తలకు పదవులతో గౌరవిస్తామని తెలిపారు. అనంతరం భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి.వి.కృష్ణయ్య, శ్రీనుబాబు, నాగోతి నరసింహనాయుడు, నక్క శ్రీధర్, భువనేశ్వరి, అనురాధ, సంతోష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : జనసేన పార్టీ కార్యాలయంలో సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మండలంలో జనసేన ఓట్ల శాతం 2019తో పోల్చుకుంటే అధికంగా పెరిగాయన్నారు. కూటమి అభ్యర్థి గెలుపు లాంచనమేనని జనసేన పార్టీ విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, కార్యదర్శులు డాక్టర్ పి.సన్యాసిరావు, బొద్దాపు గోవింద, ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : రక్తదానం ప్రాణదానంతో సమానం అని, రక్షణ రంగంలో సేవలందిస్తున్న ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని నేవల్ డాక్‌యార్డ్ కెటిబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. కాకానినగర్‌లో కెటిబి కళాక్షేత్రం తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అనేక మంది క్షతగాత్రులకు సకాలంలో రక్తం దొరకడం లేదన్నారు. అందువల్లే ఈ శిబిరం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. డాక్‌యార్డ్ ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. తమ అసోసియేషన్ ద్వారా గడిచిన ఏడాదిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని సంఘ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి విజనగిరి భాస్కరరావు తెలిపారు. ఈ శిబిరాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ సుధాకర్, అపోలో వైద్యులు రాజేష్, శ్రీకాంత్‌తో పాటు పలువురు సందర్శించి దాతలకు అభినందనలు తెలిపారు. సంఘం సభ్యులు సన్యాసిరావు, రమణ, తేజ, రాజ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రక్షణ రంగ ఉద్యోగులు

రక్తదాతలను అమ్మ బ్లడ్ బ్యాంకు, వైద్యులు అభినందించారు.

తగరపువలస : స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా "ప్రజల కోసం వైద్యులు" అనే నినాదంతో అఖిల భారత సర్జన్ల సమాఖ్య సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 80 మంది వైద్య విద్యార్థులు రక్త దానం చేశారు. రక్తదానం చేసిన వైద్య విద్యార్థులను కళాశాల డీన్ డాక్టర్ పి.వి.సుధాకర్ అభినందించారు. మెడికల్ సూపరింటెండెంట్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్, బ్లడ్ బ్యాంక్ ఇంఛార్జి డాక్టర్ శర్మ, ఎఒ పి.శివప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భీమిలి బీచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ సుధాకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హెచ్ఒడి డాక్టర్ విజయ, డాక్టర్ వాణి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివ ప్రసాద్, సుమారు 200 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ సేవా సంస్థాన్ సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-సీతమ్మధార : వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న నారాయణ సేవా సంస్థాన్ సేవలు వెలకట్టలేనివని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు కొనియాడారు. రాజస్థాన్ ఉదయపూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యాన ఆదివారం అక్కయ్యపాలెం సమీపంలోని పోర్టు ఇండోర్ స్టేడియంలో కృత్రిమ అవయవాల కొలతల శిబిరం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 500 మందికి పైగా వికలాంగులు ఈ శిబిరంలో పాల్గొని తమలోని లోపం గల అవయవాలకు సంబంధించిన కొలతలను తీయించుకున్నారు. వీరికి మూడు నెలల తర్వాత ఉచితంగా కృత్రిమ చేతులు, కాళ్లు పరికరాలు అందిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు హాజరై మాట్లాడారు. ఎంతో ఖరీదైన కృత్రిమ అవయవాలను నారాయణ సేవా సంస్థాన్ సొంత ఖర్చుతో అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వివిధ మార్వాడీ సంస్థలు, లయన్స్ క్లబ్, ఆంధ్ర ఆర్టిస్ట్ ఫెడరేషన్, సోషల్ మీడియా క్లబ్, డాక్టర్ చిరంజీవి కళాపరిషత్, స్థానిక నారాయణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొని వికలాంగులకు సేవలందించారు. వైజాగ్ వాలంటీర్స్, సత్యసాయి సంస్థలు ఇతర సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు. సంస్థ డైరెక్టర్ రంజిత్ గౌడ్, విఆర్ఒ భగవాన్ ప్రసాద్ గౌర్, సోషల్ మీడియా ఛైర్మన్ సన్ మూర్తి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి, అనసూయాదేవికి అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన ప్రోగ్రాం అధికారులకు యువజన హక్కులు- న్యాయ సహాయం అనే అంశంపై ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల నుంచి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి పాల్గొని, పలువురి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా వీరికి ప్రశంసా పత్రాలతో ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్, డాక్టర్ విఎస్.కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సీనియర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు అభినందించారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని వారిద్దరికి సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.



భాగ్యలక్ష్మి, అనసూయాదేవిని అభినందిస్తున్న హరినాథ్

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకమని చంద్రబాబు చెప్పగలరా?

గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు యత్నిస్తున్న బిజెపికి మద్దతు ఇచ్చిన చంద్రబాబు ఏ విధంగా ఈ ప్రాంతంలో ఓట్లు అడగడానికి వస్తాడని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నడుపూరులోని మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటుచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడారు. లక్షలాది కుటుంబాలు స్టీల్‌ప్లాంట్ మీద ఆధారపడి ఉన్నాయని, వారి భవిష్యత్తుపై దెబ్బ కొట్టే విధంగా మోడీ ప్రయివేటీకరణ నిర్ణయం తీసుకున్నారని, ఈ విషయంలో చంద్రబాబు మౌనం వహించడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు కపట ప్రేమ చూపిస్తున్నాడన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ప్రారంభం నుంచి వైసిపి మద్దతు తెలుపుతూ వస్తోందని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలు బాగుపడతాయన్నారు. 33 రోజులపాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టించి పనిచేసి తనను గెలిపిస్తే ఐదేళ్లపాటు మీకోసం తాను కష్టపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, కలుకూరి మంగరాజు, మొల్లిచిన్న, ఎంకెఎన్.మూర్తి, పల్లం అప్పలరాజు, బ్రహ్మానందరెడ్డి, కాకినాడ పెంటారావు, సంపంగి, అప్పలరాజు, వేణు సన్నీ, జి.రాజారావు, వినోద్‌రెడ్డి, కామేష్, సన్యాసిరావు, లక్ష్మీపతి, సిర్ల చిన్నారావు, ఎండ ఆదినారాయణ, పితాన పాత్రుడు, ఇందల సోమనాయుడు, రాజా, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్


వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

వాకర్స్‌తో పంచకర్ల మాటామంతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి గిరిప్రసాద్‌నగర్ చివరి ప్రాంతంలో ఆదివారం వాకర్స్‌తో పంచకర్ల రమేష్ బాబు మాటామంతి చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా చేసిన అనుభవం తనకుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో కక్షలే తప్ప అభివృద్ధి ఎక్కడా లేదని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి గెలుపు ఎంతో అవసరమన్నారు. అనంతరం కాలనీవాసులు చెప్పిన సమస్యలను విన్నారు. యువకులతో కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సేనాపతి శంకరరావు, జనసేన నాయకులు సోమశేఖర్‌నాయుడు, జగన్మోహన్‌పాత్రుడు, గల్లా శ్రీనివాసరావు, మధు, లక్కీ గోవిందు, గల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

పశ్చిమంలో ఆత్మీయ సమావేశాలు

ప్రజాశక్తి -ములగాడ : పశ్చిమ నియోజకవర్గం పరిధి పారిశ్రామికవాడ క్లస్టర్ -2 అధ్యక్షులు అంగ రాంప్రసాద్ ఆధ్వర్యాన రెండు గుడులు జంక్షన్ వద్ద, క్లస్టర్ -1 వైస్ ప్రెసిడెంట్ ఆడారి రమణ బాబు ఆధ్వర్యాన ప్రకాష్‌నగర్‌లో, పిలక రామ్మోహన్‌రెడ్డి, సోమాదుల సురేష్ ఆధ్వర్యాన క్రాంతినగర్‌లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. గత రెండున్నరేళ్లుగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. వైసిపి తరపున పోటీ చేస్తున్న తనను ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి చూడాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ సమావేశాల్లో వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

జిమ్స్ పాఠశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : వడ్లపూడిలోని జిమ్స్ టాలెంట్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాలలో పాఠశాల సాధించిన ప్రగతిని స్కూల్ డైరెక్టర్ గుంట జగన్నాధరావు వివరించారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త కె.కిశోర్‌చంద్, విఎంఆర్‌డిఎ చైర్మన్ చంద్రమౌళి, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని, వాటి సాధనకు కృషిచేయాలని కోరారు. పాఠశాల సాధించిన ప్రగతిని ప్రశంసించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ జగన్, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, ప్రగడ వేణు, దామోదర్, వాసుదేవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'ఉత్తరం'లో ఉత్సాహంగా వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. స్థానికులను పలకరిస్తూ కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జివిఎంసి 54వ వార్డు పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ చల్ల రజిని, ఈశ్వరరావుతో కలిసి ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలతో ముచ్చటించారు. చిరు వ్యాపారులను పలకరిస్తూ సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బాకీ శ్యాంకుమార్‌రెడ్డి, ప్రకాష్, అప్పలనాయుడు, చిరంజీవి, సోమేష్, రాధాకృష్ణ, కల్యాణ్‌రాజు, ఎంవివిఎస్.రెడ్డి, లక్ష్మీరెడ్డి, రవణమ్మ, మాలతి, వెలగ శ్రీను, శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు అమర్‌రెడ్డి, నూకరాజు, రాయుడు శ్రీను, గంగ మహేష్, బి.గోవింద్, అంబటి శైలేష్, భద్రి, బొట్టా రాజు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన

నూకాంబిక అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఉత్తర నియోజకవర్గంలో పలు ఆలయాలను కెకె.రాజు సందర్శించారు. అన్న సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 55వ వార్డు జోగారావునగర్ నూకాంబిక ఆలయం వద్ద జోగి మోహనరావు ఆధ్వర్యాన జరిగిన అన్న సమారాధనను, 49వ వార్డు బర్మా క్యాంపు కాలనీలోని నూకాంబిక ఆలయం వద్ద బర్మా కాందిశీకుల సంక్షేమ సంఘం నాయకులు, నూకాంబిక మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన అన్న సమరాధనను కెకె.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, రత్నాకర్, బిఎన్.రాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చిల సందర్శన

ఉత్తర నియోజకవర్గం పరిధి 43వ వార్డులో 80 అడుగుల రోడ్డులో గౌరీ కల్యాణ మండపం పక్కన ఉన్న చర్చితోపాటు 47వ వార్డు సంజీవయ్య కాలనీ-1 లోని చర్చి, బేతాస్త చర్చిలను కెకె.రాజు సందర్శించారు. క్రిస్టియన్ సోదరులు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిస్టియన్ సోదరుల సంక్షేమానికి వైసిపి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకట్రావు, కట్టుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు,కంటిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, చలం, రత్నరాజు, సింగ్ పాల్గొన్నారు.

దమ్ము శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి-వేపగుంట : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టులు అసోసియేషన్ ఆధ్వర్యాన జివిఎంసి పారిశుధ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న దమ్ము శ్రీనివాసరావును జబర్దస్త్ అప్పారావు, బుల్లెట్ బండి ఫేమ్ ఝాన్సీ, ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. దమ్ము శ్రీనివాసరావు అనారోగ్య సమస్యలను గుర్తించి గంట్ల శ్రీనుబాబు స్వచ్ఛందంగా ఒక రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఒక కంటి చూపు లేకపోయినా దమ్ము శ్రీనివాసరావు చేస్తున్న సేవలు ఎనలేనివని, అతన్ని సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీనుబాబు పేర్కొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పలు పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా వైసిపికి చెందిన అనేకమంది యువకులు, మహిళలు జనసేన తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా జివిఎంసి 97వ వార్డు పరిధి ద్రోణంరాజునగర్‌కు చెందిన యువకులు జనసేన పార్టీలో చేరారు. వారికి పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కండువాలు కప్పి జనసేన ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తును ఆకాంక్షిస్తూ యువకులు, మహిళలు, విద్యార్థులు ఎన్‌డిఎ కూటమిలో భారీగా చేరుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావాలన్నారు. దీనికోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజుల సుధాకర్, పార్టీ వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్, నాయకులు దుంబూరు శీలు, మిల్లు శ్రీను, గంగాధర్, గణేష్, వాసు, చిన్న, బంకుగణేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన యువత

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ గోపాలపట్నం కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు సమక్షంలో, 92వ వార్డు టిడిపి నాయకులు దాడి రమేష్‌నాయుడు, మూర్తిపట్నాయక్ ఆధ్వర్యాన యువత టిడిపిలో చేరారు. యువకులకు గణబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 91వ వార్డు ప్రాంతానికి చెందిన జనసేన యువకులు గణబాబుకు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నారిపిన్ని సత్తిరాజు, గరికన వీరబాబు, శ్యాం, గరికిన ప్రకాష్, పి.సతీష్, ఏస్‌రాజ్, నాయడు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణంపై రగడ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 73వ వార్డు పరిధి ఉడా కాలనీలో ఇండోర్ స్టేడియం నిర్మాణంపై స్థానికులు, యువకులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు మోసపూరితంగా ఉన్నాయని, దీని డిజైన్ అసంపూర్తిగా ఉందని, క్రీడాస్థలం మధ్యలో నుంచి పనులు మొదలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. జరుగుతున్న పనులు పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సంబంధిత అధికారులు క్రీడా స్థలానికి వచ్చి డిజైన్ పట్ల ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పనులు జరగనివ్వమని హెచ్చరించారు. దీనిపై జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి -యంత్రాంగం

మాధవధార : మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో చలివేంద్రాన్ని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వైసిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు పేడాడ రమణకుమారి ఆదివారం ప్రారంభించారు. ఈ చలివేంద్రానికి రైల్వే టికెట్ కలెక్టర్ సనపల శ్రీకాంత్ వారి కుమారులు హనీష్, హరీష్ జన్మదిన సందర్భంగా మజ్జిగను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా పేడాడ రమణి కుమారి మాట్లాడుతూ, ఈ అసోసియేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారని చెప్పారు. ఈ చలివేంద్రాన్ని జూన్ 2వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్, 50వ వార్డు బిజెపి అధ్యక్షులు తమ్మినేని పద్మజ, శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, అప్పల రామచంద్రరావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ పంచముఖ ఆంజనేయ, శ్రీ షిర్డీ సాయినాధ సహిత శ్రీ దుర్గాలమ్మ ఆలయం వద్ద ఆదివారం పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం అధ్యక్షులు కెవి.నాగేశ్వరరావు, సుదా లీలావతి, శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సభ్యులు నాగోతి తాతారావు, పోతిన పైడిరాజు, పిళ్లా కష్ణమూర్తి పాత్రుడు, ఎస్.శ్రీను, పొట్నూరి హరికృష్ణ, భోగవిల్లి రాము తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమణికుమారి

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

- నివారణ చర్యల్లో అధికార యంత్రాంగం విఫలం
- యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఫార్మా కంపెనీలో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టి, పునరావృతం కాకుండా చూడాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఆదివారం పరవాడ ఫార్మా సిటీలోని అరబిందో ఎపిటోరియా ఫార్మా, ఆల్కలీ మెటల్స్ కంపెనీల్లో జరిగిన ప్రమాదంలో ఆళ్ల గోవిందు (32), చందక రమణ (35) ఇద్దరు కార్మికుల మృతి, ఎపిటోరియా ఫార్మాలో మరో ఐదుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

ఫార్మా కంపెనీల్లో కార్మికుల భద్రతనుయాజమాన్యాలు గాలికొదిలేసి, కనీస భద్రతా ప్రమాణాలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఇటువంటి ఘటనలు పదేపదే చోటుచేసుకుంటున్నామయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీల పేరుతో హడావిడి చేస్తున్నారు. కంపెనీల్లో ఉన్న భద్రతా లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడం లేదన్నారు. ఇన్ని ప్రమాదాలు సంభవిస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం, ప్రమాదాలకు కారణమైన కంపెనీలపై చట్టపరమైన చర్యలలో నిర్లక్ష్యం దీనికి కారణమన్నారు.

గతంలో కూడా పరవాడ, అచ్యుతాపురం సెజ్‌ల్లో జరిగిన ప్రమాదాలపై అధికార యంత్రాంగంతో కమిటీలు వేసినా, నేటికీ నివేదికలు బహిరంగ పర్చలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన రెండు కంపెనీలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం తరపున లోకనాథం డిమాండ్ చేశారు.

ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

అనకాపల్లి : ఆల్కాలి మెటల్ కంపెనీ, యాప్టోరియా అరబిందో ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి పరిహారం బాధితులకు మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని సిఐటియు, ఫార్మా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్షులు ఆర్.శంకరరావు ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేసారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను, అలాగే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా, కార్మికుల రక్షణను గాలికొదిలేసిన కంపెనీల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు అర్.రాము,గంటా శ్రీరామ్,అల్లు రాజు,శివాజీ పరామర్శించారు.

అచ్యుతాపురం: అల్కాలి మెటల్ కంపెనీ, యాప్టోరియా అరబిందో ఫార్మా కంపెనీల్లో ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము డిమాండ్ చేశారు.ప్రభుత్వం, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు అరికట్టాల్సిన ప్రభుత్వ శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విస్తృత ప్రచారం



ఓటర్లను అభ్యర్థిస్తున్న మలసాల భరత్

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి 84వ వార్డులో వైసీపీ సీనియర్ నాయకులు గాడి మాధురి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పిళ్ళా వారి వీధి, ఎర్ర వారి వీధి, గొల్లపల్లి, సాంబశివ వీధి, బొడ్డు వీధిలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చారని, మహిళలకు మరెన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే అనకాపల్లి మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, రాష్ట్ర కార్యదర్శి పరకా రవి, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మావురి వెంకటేష్, కోరిబిల్లి శ్రీను, కాండ్రేగుల శేషు, దిమిలి సత్తిబాబు, శేఖర్, శంకర్, శివ, గొల్ల బాబు, మురళి, పెంటకోట మురళి, ఏడువాకుల నారాయణరావు, ఎస్‌వి. నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ వంశీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ముందు జాగ్రత్తలు పాటించాలని మెడిరైజ్ హాస్పిటల్ డాక్టర్ ఎండి వేగి వంశీ అన్నారు. ఆదివారం. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలో హాస్పటల్ ఆవరణలో ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం, వాకింగ్ చేయాలన్నారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తినాలని సూచించారు. ప్రస్తుతం వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతతో మండుటెండలు హడలెత్తిస్తున్న నేపథ్యంలో అత్యవసమైతే తప్ప ఎండలో బయటకు వెళ్లరాదని, ఒక వేళ వెళ్లక తప్పని పరిస్థితి వుంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.. ఎక్కువగా నీరు తాగాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు వేసవి తాపానికి గురికాకుండా సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

'నా ఆరోగ్యం నా హక్కు'పై ర్యాలీ

కశింకోట : 'నా ఆరోగ్యం నా హక్కు'లో ప్రజలు భాగస్వాములు కావాలని కశింకోట మండలంలోని తాళ్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తాళ్ళ పాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఆరోగ్యపరిరక్షణకు నిత్యం యోగా, వ్యాయామం, నడక అవసరమన్నారు. డాక్టర్ మనీష్, ఆరోగ్య బోధకుడు ప్రసాద్, నర్సింహారావు, వెంకటలక్ష్మి, అర్‌వి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు



కశింకోటలో నిర్వహిస్తున్న ఆరోగ్య ర్యాలీ

కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌ను

వెంటనే అరెస్టు చేయాలి: సిపిఎం



మాట్లాడుతున్న శ్రీరామ్

ప్రజాశక్తి- అనకాపల్లి: చోడవరం పట్టణంలో జిఎస్‌టి అధికారులను బెదిరించి దౌర్జన్యానికి పాల్పడిన ఘటనలో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌పై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం అనకాపల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం కార్యాలయంలో ఆపార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీను వాసరావు, చింతకాయల శివాజీ విలేకర్లతో మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చి తన గుండాయిజంతో అనకాపల్లి ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని కలుషితం చేసేలా సీఎం రమేష్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అనకాపల్లి ప్రాంతంలో హత్య, గుండా రాజకీయాలు మానుకోవాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో లేని దౌర్జన్యాలకు తెరలేవడం, భారీగా అక్రమ మద్యం నిల్వలు పట్టుబడడం వంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని,సిఎం రమేష్ కాలిడిన తర్వాత ఇవన్నీ చోటుచేసుకోవడంతో బిజెపి అభ్యర్థిపై అనుమానాలకు తావిస్తుందన్నారు. దీనిపై జిల్లా రిటర్నింగ్ అధికారికి పిర్యాదు చేసామన్నారు. ప్రభుత్వం వెంటనే సీఎం రమేష్‌ను అరెస్టు చేయాలని, దౌర్జన్య రాజకీయాలకు చెక్ పెట్టాలని, అక్రమ మద్యంపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినూత్న రీతిలో ధర్మశ్రీ ప్రచారం



గుర్రంపై ప్రచారం నిర్వహిస్తున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో బోళ్ల వీధి, బక్క వీధి, వెలమ వీధి, చిన్న బజార్ ప్రాంతాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వినూత్న రీతిలో ప్రచారం చేపట్టారు. స్థానిక పార్టీ కార్యకర్తల సమకూర్చిన గుర్రంపై ఎక్కి, ఇంటింటికీ వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు ఈ ప్రచారంలో మహిళలతో పాటు కార్యకర్తలు, స్థానిక నేతలు వెంపలి ఆనంద్ ఈశ్వరరావు. జ్యోతుల రమేష్, పుల్లేటి వెంకట రావు, పందిరి శ్రీను, ఓరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కలుసుకున్న ఎంజిహెచ్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరపాలెం ఎంజిహెచ్ పాఠశాల 1970-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సంక్షేమ సంఘ నిర్వహణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ,ఆదర్శ దంపతులు పొన్నా వేంకట చల్మాజీ, ఛాయాదేవి దంపతులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం గవరపాలెం పట్టణ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్న తామంతా ఇపుడు ఒక సంఘంగా ఏర్పడడం,ఆదర్శ దంపతులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఏటా వనసమారాధన నిర్వహించి, అందులో పూర్వ మిత్రులంతా కలుసుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించారు.కార్యక్రమంలో కార్యదర్శి దాడి శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, సహాయ కార్యదర్శి పి.వి.సత్యనారాయణ, కోశాధికారి పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు పి.ఎన్.సత్యనారాయణ (పైసా మాస్టారు) కొత్తూర్తి రామారావు, రాణీ ప్రసాద్, విల్లూరి రామ్, ప్రసాద్, రాయుడు, శివాజీ, కర్రి సత్యనారాయణ, విల్లూరి సాయి, ఇతర సభ్యులు సత్కార గ్రహీత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు పటిష్ట బందోబస్తు



జాతర ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు బందోబస్తు ఏర్పాట్లుపై జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. నెల రోజులు పాటు జరగనున్న ఈవేడుక ఏర్పాట్ల పరిశీలనకు ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ కె.వి.మురళీకష్ణ ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆలయ పరిసరాలు పరిశీలించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ తదితర సంబంధిత విషయాలపై డిఎస్‌పి ఎస్.అప్పలరాజుతో చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ బండారి ప్రసాద్, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ జి.శంకర రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి.పైడపునాయుడులకు భద్రతాపరమైన సూచనలు చేశారు.

జనసేనలో చేరిన వైసిపి కార్యకర్తలు



జనసేనలో చేరిన వారితో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి -అచ్యుతాపురం :ఎలమంచిలి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, జనసేనకు చెందిన సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో ఆదివారం పూడిమడక గ్రామానికి చెందిన వైసిపి నాయకులు , మహిళలు జనసేన పార్టీలో చేరారు. జనసేన పూడిమడక గ్రామ శాఖ అధ్యక్షులు సూరాడ ధనరాజు ఆధ్వర్యంలో వైసిపి నేతలు గంగిరి రవి, పి పారునాయుడు, వారి అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వారందరికీ సుందరపు విజయ్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యేగా తనను గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షులు బయలుపూడి రామదాసు, ద్వారపు రెడ్డి బాబ్జి, ఎం శ్రీవేణి పాల్గొన్నారు.

సూర్యదేవుని సన్నిధిలో కూటమి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని రాజుపాలెం గ్రామంలో శ్రీ సూర్యనారాయణ స్వామిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పీలా గోవింద్ ఆధ్వర్యంలో కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ విలీన గ్రామాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు సీఎం రమేష్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేస్ మాట్లాడుతూ, తాను అధికారంలోని వచ్చిన తర్వాత సూర్యనారాయణ మూర్తి స్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని భరోసానిచ్చారు.కార్యక్రమంలో బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, 80వ వార్డు ఇంచార్జి బొడ్డేడ జోగు నాయుడు, జనసేన ఇన్‌ఛార్జి మళ్ల శ్రీను, సిరసపల్లి సన్యాసిరావు, బాబురావు, సత్యనారాయణ, బుజ్జి, గొల్లపల్లి నర్సింగరావు, రవి, గోవింద్ పాల్గొన్నారు.

వారాహియాత్రకు కూటమి నేతలు



బైక్ ర్యాలీగా వెళుతున్న కూటమి శ్రేణులు

ప్రజాశక్తి- కశింకోట: అనకాపల్లిలో ఆదివారం జరిగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహియాత్ర సమావేశానికి కశింకోట మండలం నుంచి కూటమి పార్టీల నేతలు పెద్దఎత్తున బైక్‌లపై తరలివెళ్లారు. కూటమి నాయకులు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కాండ్రేగులు సతీష్, వుల్లింగల రమేష్, నైనంసెట్ట రమణరావు, షేక్ దర్గా, కర్రి గోవింద, కర్రి లోవరాజు, కరక సత్య నారాయణ, అభిమానులు వెళ్లారు

నేడు నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని కెపి.అగ్రహారంలో సోమవారం కొత్త అమావాస్య సందర్భంగా జరిగే నూకాలమ్మ జాతరకు గ్రామస్తులు, ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతరకు మండలంలో గల పలు గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని,ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతర సందర్భంగా నూకాలమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

రోడ్డు ఆక్రమణపై వివాదం

సమగ్ర భూసర్వేలో బయటపడ్డ జిరాయితీ హద్దుల నిర్ధారణకు ప్రహరీ నిర్మాణం
యజమానుల చర్యలను అడ్డగింత
ఆందోళన చేసిన అడ్డుకున్న గ్రామస్తులు



ప్రహరీ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ కాలనీ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలకు చెందిన రోడ్డును ఎరుకునాయుడుపాలెం రెవిన్యూ పరిధిలోని సంబంధిత భూమి జిరాయితీ యజమానులు ఆక్రమణకు పూనుకోగా, ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాలు ఎలా ఉన్నాయి. పైడివాడ అగ్రహారం రెవెన్యూ పరిధిలోనే సర్వేనెంబర్ 1 లో గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎన్టీఆర్ కాలనీ నిర్మాణం చేశారు. అలాగే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కూడా ఏర్పాటు చేశారు. ఈ కాలనీలకు వెళ్లేందుకు సబ్బవరం- లంకెలపాలెం మెయిన్ రోడ్డు నుండి 40 అడుగుల రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డును అనుకొని ఎరుకునాయుడుపాలెం రెవెన్యూకు



ప్రహరీ నిర్మాణానికి భూయజమాని తెచ్చిన సిమెంట్ పలకలు

చెందిన జిరాయితి భూములు ఉన్నాయి. ఆ భూములకు చెందిన యజమానులు కాలనీకి చెందిన రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించబోతే స్థానిక మాజీ ఎంపిటిసి అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, ఎంపిటిసి శీరం అప్పలరాజు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు ఆధ్వర్యంలో గ్రామస్తుల అడ్డుకున్నారు. కాలనీ వాసులకు రాకపోకలకు వీలుగా 40 అడుగులు రోడ్డును ఏర్పాటు చేస్తే దానిని ఎలా అక్రమిస్తారని గ్రామస్తులు జిరాయితీ భూ యజమానులను నిలదీశారు. అయితే జిరాయితీ భూ యజమానులు భూ రీసర్వేలో రెవిన్యూ అధికారులు తమకు సరిహద్దులు గుర్తించి భూములు అప్పగించారంటూ కాలనీ వాసులపై దౌర్జన్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే భూయజమానులు ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ప్రహరీని ఎలాగైనా నిర్మిస్తామని భూయజమానులు ప్రహరీ సామాగ్రి ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు తమ రహదారిని ఆక్రమిస్తే రాకపోకలకు ఆటంకాలు ఏర్పడతాయని ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎన్టీఆర్ కాలనీ రోడ్డును సర్వే చేసి తమకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ,జగనన్న కాలనీల వాసులు పాల్గొన్నారు.

కూటమి శ్రేణులతో 'పైలా' సమాలోచన



సమావేశంలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలం కలిగొట్ల గ్రామంలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలతో ఆదివారం ˇమావేశం అయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రజలలోకి లోతుగా తీసుకువెళ్లి విరివిగా ప్రచారం చేసి పార్టీ గెలుపునకు కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలన పట్ల ప్రజలు విసిగిపోయి ఉన్నారని, రానున్న ఎన్నికల్లో మాడుగుల కోటపై టీడిపి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి దొగ్గ దేముడునాయుడు,గోరుపోటు వెంకటరావు,దొగ్గ నాయుడు, మలిరెడ్డి రాజునాయుడు, గోరుపోటు సిమ్మినాయుడు,కొటకల లక్ష్మణ్,బండారు సింహాద్రప్పుడు, బొడ్డు జగదేశ్వరరావు, గోరుపోటు నారాయణమూర్తి, గోరుపోటు నాని, కరచా నారాయణదాసు, గులిపల్లి చిరంజీవి, బొడ్డు పాలవెల్లి, గొరుపోటు సంతోష్, గోరుపోటు దేముడునాయుడు, యాళ్ల పాలవెల్లి, బొడ్డు దేముడుబాబు, మండల చిట్టినాయుడు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులతో పంచకర్ల సమావేశం



టిడిపి నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు

ప్రజాశక్తి - పరవాడ: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని పరవాడ మండలంలో జనసేన బిజెపి టిడిపి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్న పంచకర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా రావాడ పంచాయతీ జల్లెలపాలం గ్రామంలో ఉన్న మరిడమాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పంచకర్లను ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం చిన్న ఇంటి వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పంచకర్ల మాట్లాడుతూ, పొత్తు ధర్మాన్ని గౌరవించి ఉమ్మడి అభ్యర్థిత్వాన్ని ఆశీర్వదించాలని పంచకర్ల కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు శ్రీనివాస్ నాయుడు, రావాడు పంచాయతీ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, తెలుగుదేశం నాయకులు సారిపల్లి జోగి నాయుడు, బట్ట నాగరాజు, కోరుకొండ నరేష్ ,కోరుకొండ కొండయ్య, మళ్లీ గంగాధర్, మరిస శ్రీను, మరిసా అప్పలరాజు, గ్రామ వైస్ సర్పంచ్ కావలి అప్పలరాజు పాల్గొన్నారు.

540 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-చోడవరం :శాంతియుత ఎన్నికల నిర్వహణను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా మండలంలో 540 మందిపై బైండోవరు కేసు నమోదు చేసామని చోడవరం సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. 14 ఎక్సైజ్ కేసులు నమోదు చేసి ఇప్పటివరకు రూ. రెండు లక్షల తనిఖీల ద్వారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. చోడవరం పట్టణంలో తరచూ తనిఖీలు, రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యంతాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యాన్ని అక్రమంగా ఎవరైనా తరలించినట్లయితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పరచేందుకు పార్టీలు ఏమైనా తాయిలాలు పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే సమాచారం అందించాలని కోరారు.

యోగా సహోపాధ్యాయ శిక్షణ శిబిరం



శిక్షణలో సాధన చేస్తున్న యోగాభ్యాసకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని జార్జిక్లబ్‌లో పతంజలి యోగా సమితి హరిద్వార్ పర్యవేక్షణలో యోగా సహోపాధ్యాయ శిక్షణా తరగతులను ఆదివారం శ్రీ వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ విష్ణుమూర్తి, హరిద్వార్ పతంజలి యోగ్ పీఠ్ స్వామి రిత్ దేవ్‌జీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తెలుగు ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేటర్, పతాంజలి యూత్ ప్రెసిడెంట్ అశోక్ ఆర్య పర్యవేక్షణలో నిర్వహించే 25 రోజులు యోగా సాధకుల శిక్షణ తరగతుల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండేసి గంటలు శిక్షణ తరగతులు ఉంటాయని, యోగా సాధకులు వీటిని వినియోగించుకోవాలన్నారు.. వ్యాధినిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యంగా జీవించేందుకు కొద్దిపాటి వ్యాయామంతో కూడా యోగా చక్కటి మార్గమన్నారు. శిక్షణ అనంతరం నైపుణ్యత సాధించిన వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తారన్నారు జిల్లా అధ్యక్షునిగా భీశెట్టి దొరమ్మ నాయుడు పర్యవేక్షణతో జరుగు కార్యక్రమంలో పెంటకోట సుబ్రహ్మణ్యం, బిఎస్ఎంకె జోగినాయడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, జిమంగయ్య, కొణతాల శివాజీ, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలపర్తి కన్నబాబు, ఆళ్ల సూర్య రామకష్ణ, కొణతాల పెద్ద, మల్ల నరసింగరావు, బుద్ధ సత్యనారాయణ కర్రి గంగాధర్, వంశీధర్, రోహిణి, రవణమ్మ, భీశెట్టి లక్ష్మి, పి సత్య నారాయణ, పెంటకోట సత్యనారాయణ తుమ్మపాల శ్రీకృష్ణ యోగ బిఎన్ఆర్, మాదేటి జగన్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు 'బూడి'కి ఆహ్వానం



బూడికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న సంఘసభ్యులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : పెందుర్తి మండలం కోటనరవ గ్రామం, 88వ వార్డులో వెలసిన నూకాంబిక ఆధ్వర్యంలో నూకాంబిక జీర్ణోదరణ సహిత విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి, అనకాపల్లి వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు గౌరీ వినాయక యువజన సేవా సంఘం సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఆదివారం తారువలోని బూడి స్వగృహానికి వచ్చిన సంఘసభ్యులు ముందుగా ముత్యాలనాయుడును శాలువాతో సత్కరించి, ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 8న ౖ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తప్పనిసరిగా రావలసిందిగా సంఘ సభ్యులు డిప్యూటీ సీఎంను కోరారు.

కనీస వసతులు కరువు

-రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్ల లేక అవస్థలు -ఇదీ గొట్టువాడ కాలనీ వాసుల దుస్థితి

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలోని గుట్టువాడ గ్రామంలో ప్రభుత్వ కాలనీ ఇళ్ల వద్ద కనీస వసతులు లేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గ్రామంలో నర్సీపట్నం, పోలవరం రోడ్డు ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వం డి ఫామ్ పట్టా భూమిని కొనుగోలు చేసి సుమారు 31 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసి ఇల్లు మంజూరు చేసింది. ఇక్కడ అందరూ ప్రస్తుతం ఇల్లు నిర్మించుకుంటున్నారు. దాదాపు చాలా మంది గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో పాత గొట్టువాడ గ్రామానికి చెందినవారు అధికంగా ఉన్నారు. నిర్మాణాలు దాదాపు పూర్తయినా ఇక్కడ కనీస వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు కోసం నానా అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీటి కోసం కొత్తగొట్టు వాడ ప్రాంతానికి వెళ్లి సుమారు కిలోమీటర్ దూరం వరకు నడిచి వెళ్లి నీరు తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. కాలనీలో రోడ్ల నిర్మాణాలు, వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేక రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ జల్జీవన్ మిషన్ ద్వారా తూతూ మంత్రంగా పైపులైను నిర్మించారు. కాలనీ వద్ద వాటర్ ట్యాంక్ లేక పోవడంతో నిరుపయోగంగా మారింది. కొండవాలు ప్రాంతాన నిర్మించడంతో వర్షాలు అధికంగా కురిసినప్పుడు ఇళ మధ్య నుంచి నీరు ప్రవహిస్తున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. స్థానికంగా ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా బండరాళ్లు ఉండటంతో నీరు ఇంక లేదు. సత్వరమే తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని, వీధిలైట్లు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు లేక అస్తవ్యస్తంగా ఉన్న మార్గం

సౌకర్యాలు లేక అవస్థలు

ప్రభుత్వం ఇల్లు స్థలం ఇచ్చి చేతులు దులుపుకుంది. ఇక్కడ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ లేవు. వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నాం. కనీసం రోడ్లు కూడా లేవు.



వీసం అనురాధ
కాలనీవాసురాలు

వసతులు కల్పించాలి

అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇల్లు నిర్మాణం చేపట్టుకున్నాం. నానా ఇబ్బందులు పడి ఇల్లు నిర్మించుకుంటే కనీసం వసతులు లేవు. ప్రభుత్వం సౌకర్యం కల్పించాలి.



పుట్టా శాంతి,
కాలనీవాసురాలు



ఇంకి పోయిన ఇంకుడు గుంత



ప్రచారం చేపడుతున్న అనిత

పలు చోట్ల టిడిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదతీనార్ల గ్రామంలో ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి పార్టీల పాయకరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం యాత్ర చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనిత ఇంటింటా ప్రచారం చేపడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే తాగునీటి, ఇళ్ల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో ఎన్డీఏ కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, మాడుగులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, వైస్ ఎంపీపీ కసిరెడ్డి గణపతి, క్లస్టర్ ఇంచార్జి పేరపు కొండబాబు, రెడ్డి రాము పాతాళం ఎర్రినాయుడు, జాజి మొగ్గల ప్రసాద్, శరగడం శివ పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని చింతలూరు, గుడివాడ అగ్రహారం గ్రామాల్లో టిడిపి, బిజెపి అభ్యర్థుల్ని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉండూరు దేవుడు, రాజ్ కుమార్, రమేష్, ఉండూరు రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు

బీసీలు ఐక్యం కావాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: రాక్షసి పాలన అంత మొందాలంటే బీసీలంతా ఐక్యంగా పోరాడాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం పాములవాక గ్రామంలో వేచలపు జనార్ధన్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు ప్రత్యేక గౌరవం తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ప్రస్తుత అధికార పార్టీ బీసీ కులాలను అన్ని విధాలుగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు బీసీలంతా ఏకం కావాలన్నారు.

టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు మాట్లాడుతూ, కీర్తిశేషులు ఎన్టీ రామారావు బీసీలకు ప్రత్యేక గౌరవం తీసుకు వచ్చారని, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు తూట్లు పొడిచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, బికె పల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సత్యనారాయణ, పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే..

గిరిజనుల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-అరకులోయ: త్వరలో జరగనున్న అరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ అభివృద్ధికి నిరంతరం పోరాడుతున్న పార్టీ ఒక సిపిఎం మాత్రమేనన్నారు. జివో 3కు చట్ట బద్ధత, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల సాధనకు ఆదివాసి గిరిజనుల తరపున చట్ట సభల్లో పోరాడి సాధించుకోవడం సిపిఎంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన 1/70 చట్టం పటిష్టంగా అమలు, బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను రద్దు కోసం, మైనింగ్ అటవీ సంపదలను కాపాడుకోవడానికి సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బిజెపికి తొత్తుగా ఉన్న టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఆదివాసీలను ఓడిస్తేనే భవిష్యత్తులో గిరిజనులకు మనుగడ ఉంటుందని చెప్పారు. ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. వేసవి కాలంలో మంచినీరు కల్పించడానికి కనీసం ప్రణాళికలు కూడా తయారు చేయలేని ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధిని ఎలా చేస్తాయని వారు ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధికి పోరాడుతున్న సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బస్కీ మాజీ ఎంపీటీసీ, సిపిఎం మండల పార్టీ నాయకుడు బురిడీ దశరథ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, పొద్దు బాలదేవ్, పాంగి రాజు, పూజారి చందర్, బురిడి గోపాల్, సమర్ధి మెద్నో, కృష్ణ, స్వామి, గోవింద్, వార్డు మెంబర్ సమర్ధి మొస్య, గొల్లూరి అప్పలనాయుడు, బురిడి కొండబాబు, సొన బాబు, శోభన్ పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి నినదిస్తున్న అప్పలనర్స, గంగరాజు

ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: పాడేరులోని తలారసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌ను ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ విజయ సునీత సందర్శించారు. ఈ సందర్భంగా వాల్యూయేషన్ నిర్వహణ తీరుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. ఏర్పాట్లను సమీక్షించి ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న నిర్వాహకులు

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం ఆర్పీ మార్టియల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కరాటే కాంపిటేషన్స్‌లో నర్సీపట్నం, యండపల్లి తదిత ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని బెల్ట్ టెస్ట్ పాస్ అయి వివిధ రకాల గ్రేడ్స్‌లో బెల్ట్‌లు తమ సొంతం చేసుకున్నారు. ఎల్లో బెల్ట్, ఆరెంజ్, గ్రీన్, బ్లూ బెల్ట్, బ్రౌన్, పర్పుల్ బెల్ట్, బ్లాక్ బెల్ట్ వివిధ కేటగిరిల్లో క్రీడాకారులకు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యాపారవేత్త, రాయల్ పార్కు రిసార్ట్ అధినేత బంగారం, వాసవీ క్లబ్ అధినేత వెలగా నారాయణరావు, ప్రముఖ ఆంగ్ల ఉపాధ్యాయురాలు, అంతర్జాతీయ క్రీడాకారిణి పివిఎం నాగజ్యోతి పాల్గొని వివిధ రకాల బెల్ట్‌లు, సర్టిఫికేట్లు ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా పివిఎం.నాగజ్యోతి మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్‌లో యువత రాణించాలని, ముఖ్యంగా యువతులు మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదును పొందడంతో సమాజంలో ఎదురవుతున్న విపత్కర పరిస్థితులను ఎదుర్కోగలిగే ధైర్యం వస్తుందన్నారు.



వాకర్స్‌తో కలిసి నడుస్తున్న ఎంవివి సత్యనారాయణ

జోరుగా ఎంవివి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ ఎంఎల్‌ఏ అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఆదివారం ఉదయం జీవీఎంసీ 20, 21వ వార్డ్ పార్క్ హోటల్ నుంచి ఆర్కె బీచ్, వైఎస్ఆర్ విగ్రహం నుండి ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. వాకర్స్ పార్కులలో వాకర్స్‌ను, సీనియర్ సిటిజెన్స్‌ను కలిసి వారితో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మువ్వల సురేష్ మధుపాడరవికుమార్, మత్స్యకార వైసిపి నాయకులు గంపల వెంకట రామచంద్రరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులుచ, మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

విశాఖ తూర్పు నియోజకవర్గం స్థానిక జీవీఎంసీ 19వవార్డ్ పెద జాలరిపేట ప్రాంతానికి చెందిన పొట్టి గొల్లోడు (40) అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులను ఎంవివి సత్యనారాయణ పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైసీపీ ఇంచార్జి సూరాడ వెంకట లక్ష్మి దాస్, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

5 నుంచి మత్స్య మాడుగులమ్మ జాతర

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండల కేంద్రంలోని గ్రామ దేవత మత్స్య మాడుగులమ్మ జాతర మే 5, 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో తేదీలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మత్స్యరాస బాలరాజు. మత్స్యరాస వెంకటలక్ష్మి, మనీ కుమారి, ఎం రామచంద్రరావు, సింహాచలంరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఎం.వరహాలరాజు, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, అరుణ్ కుమార్, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రామరాజు ఎన్నికయ్యారు.

ఓటు వేయాలంటే అవస్థలే!

-రోడ్డు సౌకర్యం లేక కాలినడకన వెళ్లాల్సిందే..
-19 గ్రామాలకు రెండే పోలింగ్ కేంద్రాలు
- సబ్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు గిరిజనుల డిమాండ్



కొండలపై కాలినడకన వెళుతున్న గిరిజనులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -కొత్తకోట:

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు చెందిన ఓటర్లు ఎన్ని కల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొండలు దాటుకుంటూ మైళ్ల దూరం కాలినడకన రావాల్సిన దుస్థితి దాపరించింది. గతంలో కొన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ఎన్నికల సిబ్బంది గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు కొన్ని గ్రామాలకు రహదారి ఉన్నా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ముందుకు రాలేదని గిరిజనులు విమర్శిస్తున్నారు.

ఈ పంచాయతీలో చీమలపాడు, ములకలాపల్లిలోనే పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇవి మిగతా గ్రామాలకు దూరంగా ఉండటంతో ఓటేయడానికి వచ్చేందుకు వృద్ధులు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు.

చీమలపాడు శివారులో రాయిపాడు, పెదగరువు, అజేయపురం, తాడిపర్తి, జెడ్. జోగింపేట, రొచ్చుపనుకు తదితర గ్రామాలు పంచాయతీ కేంద్రం చీమల పాడుకు నాలుగు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మొత్తం ఓటర్లు సుమారు 1,870 మంది. వీరిలో మహిళలు 900, పురుషులు 867 మంది ఉన్నారు. ములకలాపల్లి పోలింగ్ కేంద్రంలో 994 మందికి చీమల పాడు కేంద్రంలో 876 మందికి పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తారు. చీమలపాడు పరిధిలో 19 గ్రామాలున్నాయి. వీటిలో చలిసింగం, అజేయపురం, జీలుగులోవ, నేరేడుబంద, తదితర గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సదుపాయం లేదు. 500 మంది జనాభా నివసించే చలిసింగం కొండల మధ్యలో చీమలపాడు కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డు లేక పోవడంతో ఇక్కడి వారంతా ఎక్కడకు వెళ్లాలన్నా కొండలు దాటుకుంటూ కాలినడకన సీకాయపాడు వరకు వచ్చి అక్కడ్నుంచి ఆటోలను ఆశ్రయిస్తుంటారు. రాయిపాడు, పెదగరువు, తాడిపర్తి, రొచ్చు పనుకు, గంగంపేట, జెడ్. జోగిలపేట, ఆజేయ పురం, కడగెడ్డ, బంగారుబందల, నేరేడు బంద, జీలుగులోవ, కుంజుర్తి, పీడింపాలెం, డుకులం పాడు, కల్యాణపు లోవ తదితర 15 గ్రామాలకు చెందిన ఓటర్లు ములకలాపల్లి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయాలి. చలిసింగం, ములకలాపల్లి, చీమలపాడు, వలసలపాడు గ్రామాల ఓటర్లు చీమలపాడు లోని పోలింగ్ కేంద్రంలో ఓటేయాలి. ములకలాపల్లిలో పోలింగ్ కేంద్రం ఉన్నా.. అక్కడి వారికి చీమలపాడు కేంద్రంలో ఓట్లున్నాయి. దీంతో వారంతా రెండు కి.మీ దూరం లోని చీమలపాడు కు వచ్చి ఓటేయాల్సి వస్తోంది. జబ్బు చేసినా, అనారోగ్యానికి గురైనా, నెలలు నిండి పురిటినొప్పులు వస్తే.. డోలీలో కొండ దిగువకు మోసుకు రావాల్సిందే, రాయిపాడు, పెదగరువు, తాడిపర్తి, రొచ్చు పనుకు, గంగంపేట, అజేయపురం, నేరే డుబంద, జీలుగులోన తదితర పది శివారు గ్రామాల ఓటర్లకు జెడ్. జోగింపేటలోను, చలిసింగం, వలసలు పాలెం గ్రామాల ఓటర్లు కు సికాయ పాడులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పలుమార్లు ఆందోళనలు కూడా చేపట్టారు.

ఇబ్బంది పడుతున్న ఓటర్లు

గిరిజనులు ఓటు హక్కును పూర్తిగా వినియోగించుకోవడానికి జోగంపేట, సికాయపాడులలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మావోయిస్టు ప్రభావితం ప్రాంతం అంటూ ఓటర్లను ఇబ్బందులు పెడుతున్నారు. మే 13 కు అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికల అధికారులకు వినతిపత్రం అందజేస్తాం.

కె. గోవిందరావు,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు

సబ్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సుమారు పది గ్రామాల ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు దూరం కావడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేక సకాలంలో ఓటు హక్కును వినియోగించు కోలేకపోతున్నారు. ఎన్నికల అధికారులు చొరవ తీసుకోని ఈ ఎన్నికల కైనా సబ్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి...

వంజరి గంగరాజు
సర్పంచ్,
చీమలపాడు

పౌర, మానవ హక్కులను కాపాడటమే ..

బాలగోపాల్‌కు అందించే నిజమైన నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: హక్కుల ఉద్యమంలో ప్రొఫెసర్ బాలగోపాల్ పోషించిన పాత్ర నేటి ఉద్యమకారులకు దిక్సూచి వంటిదని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ ఎఫ్) రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రొఫెసర్ సుధ అన్నారు. మానవ హక్కుల వేదిక ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం' 25 సంవత్సరాల హక్కుల కార్యాచరణ'పేరుతో సదస్సును నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకులు ప్రొఫెసర్ బాలగోపాల్ ప్రారంభించిన హక్కుల ఉద్యమం నేపథ్యంపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు.అనంతరం సదస్సులో ప్రొఫెసర్ సుధ ప్రసంగిస్తూ ప్రతి మనిషికి హక్కులు ఉంటాయని, హక్కుల కోణాన్ని ఆవిష్కరించిన వ్యక్తి బాలగోపాల్ అన్నారు. పౌర, మానవ హక్కులపై చర్చ వచ్చేటప్పుడు తప్పనిసరిగా బాలగోపాల్ ప్రస్తావన వస్తుందన్నారు.ఎన్ని నిర్బంధాలు వచ్చినా భయపడకుండా హక్కుల ఉద్యమానికి ఆయన మార్గం చూపించారన్నారు. పౌర,మానవ హక్కుల్ని కాపాడడమే నేటి ఉద్యమకారులు బాలగోపాల్ కు అందించే నిజమైన నివాళి అన్నారు.

పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ,హక్కుల ఉద్యమంలో బాలగోపాల్ పాత్ర నేటి ఉద్యమకారులకు ఆదర్శనీయమన్నారు. బాలగోపాల్ ఏనాడూ హక్కుల ఉద్యమంలో వెనకడుగు వేయలేదన్నారు. అనంతరం పాలిస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపి ఆ దేశానికి విమోచన కల్పించాలని హెచ్ఆర్ఎఫ్ నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. మానవ హక్కుల వేదిక రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హెచ్ఎర్ఎఫ్ ఉపాధ్యక్షులు ఎం.శరత్, ప్రముఖ విమర్శకులు విరసం వర్మ, న్యాయవాది చలం, లిబరేషన్ విభాగ జిల్లా అధ్యక్షులు అజయ్ కుమార్, లిబరేషన్ చోడవరం అభ్యర్థి ఎస్. గణేష్, 'మనభూమి' సంపాదకులు పి.సత్యనారాయణ, విద్యార్థి, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా, పౌర హక్కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండుటెండలో ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఉపాధి హామీ పనులు చేపడుతున్న పని ప్రదేశంలో కూలీలకు కనీస మౌలిక సౌకర్యాలు లేక మండుటెండలో పనులు చేస్తున్నారు. దీంతో, ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేపడుతున్న పని ప్రదేశంలో టెంట్, తాగునీరుతో పాటు ప్రథమ చికిత్స మెడికల్ కిట్టు, వేసవిలో మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పని ప్రదేశంలో ఇటువంటి సౌకర్యం కల్పించలేదు. దీంతో ఉపాధి కూలీలు మండు టెండల్లోనే పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో నీడ సౌకర్యం లేక ఉపాధి కూలీలు ఎండల్లో మండుతూ పనులు చేపడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో సౌకర్యాలను కల్పించేవారు ప్రస్తుతం అటువంటి సౌకర్యాలు లేవు.

ఘనంగా ఉగాది సంబరాలు



కళాకారులను సత్కరిస్తున్న ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్లో ఆదివారం జర్నలిస్టుల ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉగాది సంబరాలకు విఎంఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రోధినామ సంవత్సర ఉగాది తెలుగు ప్రజలందరి జీవితాలలో వెలుగును నింపాలని ఆకాంక్షించారు. పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలిసి ఉగాది సంబరాలు జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. పాత్రికేయ వృత్తిలో ఉన్న ఒత్తిడులను అధిగమించేందుకు ఇటువంటి సంబరాలు దోహదపడతాయన్నారు. పంచాంగ శ్రవణం చేసిన పురోహితులు శర్మ ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి రాష్ట్రం, దేశం సస్యశ్యామలంగా ఉంటుందని జోస్యం చెప్పారు. 12 రాశులకు సంబంధించిన రాశి ఫలాలు, ఆదాయ-వ్యయాలు, రాజపూజ్య-అవమానాలను వివరించారు. పల్సర్ బైక్ ఝాన్సీ, ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ రమేష్ తమ నృత్య ప్రదర్శనలతోనూ, జబర్దస్త్ హాస్యనటుడు రాపేటి అప్పారావు తన హాస్య స్కిట్లతో ఆహూతులను అలరించారు. మౌనిక ఆధ్వర్యాన చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం జర్నలిస్టుల కుటుంబాల్లోని మహిళలకు చీరలు, పంచాంగాలు పంపిణీ చేశారు. జర్నలిస్టులకు గౌరవ అతిథులు మట్టపల్లి హనుమంతరావు, సింకా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, సమాజం కోసం శ్రమించే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సంతోషమయమైన జీవితం గడపాలని, ఉగాది ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. ఫెడరేషన్ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ, అందరి సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అర్బన్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, సాంబశివరావు, బందరు శివప్రసాద్, కోశాధికారి మూర్తి, సీనియర్ జర్నలిస్టులు ఆర్.నాగరాజ్ పట్నాయక్, కిల్లి ప్రకాశరావు, ఆనంద్, ఆయా ప్రాంతాల జర్నలిస్టులు పాల్గొన్నారు.